# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :60 | 14-09- 2026 | సోమవారం | పేజీలు: 4 | వెల:03/-







# చెత్తలో మగ్గుతున్న బహుళ పనుల కార్మికుల బతుకులు!

- శ్రమ దోపిడీకి గురవుతున్న పంచాయతీ కార్మికులు..
- రూ.9,500తో కుటుంబ పోషణ సాధ్యమేనా?
- తెల్లవారుజాము నుంచి చీకటి పడే వరకు చాకిరీ.. పట్టించుకోని పాలకులు



నిర్మల్, సెప్టెంబరు 13 తెలంగాణ వెన్నెల వాక్కు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే చేతులే ఇప్పుడు పేదరికంలో మగ్గుతున్నాయి. ప్రజల ముంగిట పేరుకుపోయే చెత్తను తొలగించే కార్మికుల జీవితాల్లో మాత్రం కష్టాల కుప్పలు పేరుకుపోతున్నాయి. గ్రామాల పరిశుభ్రత కోసం నిత్యం శ్రమిస్తున్న బహుళ పనుల కార్మికుల జీవితాలు దుర్భరంగా మారినా పాలకులకు మాత్రం వారి గోడు పట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం వెలుగు రాకముందే విధుల్లోకి దిగి గ్రామమంతా శుభ్రం చేస్తున్న కార్మికులు.. నెలాఖరుకు మాత్రం చేతిలో చిల్లిగవ్వ లేక అప్పుల కోసం తలుపులు తట్టాల్సిన దుస్థితిలో ఉన్నారు.

**పేరు బహుళ పనులు.. బాధ్యతలు అనంతం**

బహుళ పనుల కార్మికుల పేరుతో వారిపై పనుల భారాన్ని మోపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ల నుంచి చెత్త సేకరణ, వీధుల శుభ్రత, మురుగు కాలువల పూడికతీత, చెత్తాచెదారం తొలగింపు, దోమల నివారణ చర్యలు.. ఇలా గ్రామంలో ఏ పని కనిపించినా ముందుగా గుర్తొచ్చేది వీరే. వర్షాకాలంలో మురుగు కాలువలు పొంగిపొర్లినా, చెత్త పేరుకుపోయినా, పారిశుధ్య సమస్య తలెత్తినా కార్మికులే రంగంలోకి దిగాలి. అవసరమైతే తాగునీటి సరఫరా పనులు, అత్యవసర పనులు కూడా చేయాల్సిందే. ఒక్క మనిషి.. పదుల పనులు అన్నట్టుగా పరిస్థితి తయారైందని కార్మికులు వాపోతున్నారు.

**పనికి హద్దు లేదు.. వేతనానికి విలువ లేదు**

ఉదయం ఎప్పుడు పని మొదలవుతుందో తెలుసు.. కానీ ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి. పని గంటలకు స్పష్టమైన హద్దులు లేకపోవడంతో అందుబాటులో ఉన్నంతసేపు పని చేయాల్సి వస్తోందని కార్మికులు చెబుతున్నారు. ఇంతటి శ్రమ చేస్తున్నా అందుతున్న వేతనం మాత్రం కుటుంబాన్ని గట్టెక్కించే స్థాయిలో లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.9,500 మాత్రమే అందుతుండగా.. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పిల్లల చదువులు, ఇంటి అద్దె, వైద్యం, విద్యుత్ ఖర్చులు, కుటుంబ అవసరాలు పెరిగిపోతున్నాయి. కానీ వేతనం మాత్రం అక్కడే నిలిచిపోయింది.

**రూ.9,500తో బతుకు బండి ఎలా?**

"నెలంతా కష్టపడితే వచ్చే రూ.9,500తో నెలంతా కుటుంబాన్ని ఎలా పోషించాలి?" అనేది కార్మికుల ప్రశ్న. జీతం చేతికి వచ్చిన వెంటనే ఇంటి ఖర్చులు, అప్పుల చెల్లింపులకే సరిపోతోందని చెబుతున్నారు. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం వస్తే పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. పిల్లల చదువులకు డబ్బులు అవసరమైనా చేతులు ఖాళీగా ఉండటంతో అప్పు చేయక తప్పడం లేదని వాపోతున్నారు.

**శ్రమకు గుర్తింపు ఎక్కడ?**

గ్రామాల పరిశుభ్రత కోసం తమ ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న తమ శ్రమకు సరైన గుర్తింపు లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తలోకి దిగుతూ, మురుగు కాలువలను శుభ్రం చేస్తూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న తమకు కనీస వేతనం కూడా దక్కకపోవడం అన్యాయమని అంటున్నారు. తమకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

**బహుళ పనుల పేరుతో బతుకులపై భారం**

ఒక్కొక్క కార్మికుడిపై అనేక బాధ్యతలు మోపడం వల్ల పని భారం పెరిగిపోతోందని వారు చెబుతున్నారు. పరిశుభ్రతకు ప్రత్యేక సిబ్బంది, ఇతర పనులకు ప్రత్యేక సిబ్బంది ఉంటేనే పనులు సక్రమంగా సాగుతాయని పేర్కొంటున్నారు. బహుళ పనుల పేరుతో కార్మికులను అన్నిరకాల పనులకు వినియోగించడం మానుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**గోడు వినకపోతే గర్జిస్తాం**

ఇన్నాళ్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదని కార్మికులు అంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఇక మౌనంగా ఉండబోమని హెచ్చరిస్తున్నారు. వేతన పెంపు, ఉద్యోగ భద్రత, పనిభారం తగ్గింపు వంటి డిమాండ్లపై ఐక్యంగా పోరాటానికి సిద్ధమవుతున్నామని స్పష్టం చేస్తున్నారు. గ్రామాలను శుభ్రం చేసే చేతులకు న్యాయం చేయలేని పాలనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికుల బతుకులను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే. వారి శ్రమకు విలువ ఎప్పుడు దక్కుతుందో వేచి చూడాల్సిందే.




# పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండ:

## ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనానికి సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ



హైదరాబాద్, సెప్టెంబర్ 13:
పేద ఆర్యవైశ్య కుటుంబాల సంక్షేమానికి, వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు ఘంటాపథంగా భరోసా ఇచ్చారు. ఆర్యవైశ్యులు అత్యంత సౌమ్యులు, మానవతావాదులు, ఆత్మాభిమానం కలిగిన సమాజ శ్రేయోభిలాషులని ఆయన కొనియాడారు. కష్టాల్లో ఉన్న పేద ప్రజల నమ్మకానికి, నిరంతర విశ్వాసానికి వారు నిదర్శనంగా నిలుస్తూ, సమాజంలో అత్యంత విలక్షణమైన, గౌరవప్రదమైన పాత్ర పోషిస్తున్నారని ప్రశంసల వర్షం కురిపించారు.

?హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడు శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ భూమిపూజ

2

# రాజకీయాధికారమా? లేక ఉనికి కోసం నాటకమా?

## తెలంగాణలో పవన్ కల్యాణ్ రాజకీయాలు పారేనా?

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో ఊహించని విజయం సాధించి, అక్కడి ఉపముఖ్యమంత్రి పదవి తెచ్చిపెట్టిన తాత్కాలిక ఊపుతో పవన్ కల్యాణ్ ఇప్పుడు మళ్లీ తెలంగాణపై కన్ను వేశారు. త్వరలోనే ఆయన తెలంగాణలో విస్తృతంగా అడుగుపెట్టబోతున్నారని, ఆయన రాకతో ఇక్కడి రాజకీయ సమీకరణాలు పూర్తిగా తలకిందులు కాబోతున్నాయంటూ జనసేన వర్గాలు పత్రికల్లో, సోషల్ మీడియాలో భారీ స్థాయిలో ప్రచారం చేసుకుంటున్నాయి. అయితే, ఆంధ్రప్రదేశ్ రాజకీయ వాతావరణం వేరు, తెలంగాణ ప్రత్యేకమైన పొలిటికల్ డిజైన్ కలిగిన గడ్డ అనే ప్రాథమిక సత్యాన్ని విస్మరించి వేస్తున్న ఈ తొందరపాటు అడుగులు జనసేనకు తెలంగాణలో రాజకీయ పునాదులు వేయడం దేవుడెరుగు, ఉన్న కాస్త క్రెడిబిలిటీని కూడా పూర్తిగా గంగలో కలిపేయడం ఖాయంగా కనిపిస్తోంది. పొరుగు రాష్ట్రంలో లభించిన అధికార ప్రాప్తిని చూపి ఇక్కడ ఓట్లు డిపాజిట్లుగా మార్చుకోవచ్చనుకోవడం పవన్ కల్యాణ్ తీవ్రమైన రాజకీయ అజ్ఞానానికి, అపరిపక్వతకు అద్దం పడుతోంది.

?ఒక రాజకీయ పార్టీకి స్థానికత, బలమైన సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే భావజాలం అనేవి వెన్నుముక లాంటివి. కానీ, గడిచిన పదేళ్ల తెలంగాణ రాజకీయ చరిత్రలో జనసేన ఉనికి ఎక్కడైనా ఉందా అని ప్రశ్నిస్తే శూన్యమనే సమాధానమే వస్తుంది. కనీసం ఒక మండలంలో లేదా బూత్ స్థాయిలో కమిటీని కూడా పూర్తిస్థాయిలో నియమించుకోలేని చాతకానితనంతో కొట్టుమిట్టాడుతున్న ఆ పార్టీ, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని తెలంగాణ ప్రజల ముందుకు రాబోతోంది? గతంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో భాజపాతో తోక ముడిచి, ఎనిమిది స్థానాల్లో పోటీ చేస్తే కనీసం డిపాజిట్లు కూడా దక్కక దౌర్భాగ్య స్థితిని మూటగట్టుకున్న విషయాన్ని పవన్ కల్యాణ్ అంత త్వరగా ఎలా మరిచిపోయాడో అర్థం కావడం లేదు. హైదరాబాద్ నగర శివార్లలో ఉండే కొద్దిమంది సినీ అభిమాన సంఘాల హడావుడి తప్పిస్తే, గ్రామీణ తెలంగాణ సమాజంలో జనసేన అనే పేరు వినపడటం కూడా అరుదే.

?ఇక ఈ పర్యటనతో తెలంగాణలో పొత్తుల సమీకరణాలు మారుతాయని చెప్తున్న కట్టుకథలు మరింత హాస్యాస్పదంగా ఉన్నాయి. ఏపీలో కూటమి ధర్మాన్ని పాటించినంత మాత్రాన, తెలంగాణ భాజపా నేతలు తమ సొంత ఓటు బ్యాంకును, ఉనికిని జనసేనకు తాకట్టు పెడతారని భావించడం ఒక రకమైన కలల ప్రపంచంలో విహరించడమే. తెలంగాణలో భాజపా తానొక ప్రధాన ప్రతిపక్షంగా, భవిష్యత్ ప్రభుత్వంగా ఎదిగేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ఈ కీలక వేళ, ఎలాంటి పునాది లేని జనసేనను భుజాన ఎత్తుకోవడానికి స్థానిక భాజపా నాయకత్వం కానీ, క్యాడర్ కానీ ఏమాత్రం సిద్ధంగా లేవు. ఢిల్లీ పెద్దల ఒత్తిడితో గతంలో పొత్తులు పెట్టుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భాజపా కార్యకర్తలు జనసేనను ఎంతగా ఈసడించుకున్నారో గతం సాక్షిగా అందరికీ తెలుసు.

?అటు జాతీయ స్థాయిలో ఎన్డీయేలో భాగస్వామిగా కొనసాగుతూ, ఇటు తెలంగాణలో బిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటారనే వార్తలు మరింత నవ్వులాటగా ఉన్నాయి. భాజపాకు తీవ్ర శత్రువుగా ఉన్న బిఆర్ఎస్‌తో పవన్ కల్యాణ్ చేయి కలపడం అనేది రాజకీయంగా పూర్తిగా అసాధ్యం, ఆత్మహత్యాతుల్యం. ఒకవేళ కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం లేదా సీట్ల సర్దుబాటు కోసం అటువంటి ఊసరవెల్లి విన్యాసాలు చేస్తే, పవన్ కల్యాణ్ మిగిల్చుకున్న కొద్దిపాటి పొలిటికల్ క్రెడిబిలిటీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోతుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడానికి లేదా ఢీకొట్టడానికి జనసేన వద్ద ఉన్న స్పష్టమైన సిద్ధాంతం గానీ, స్థానిక అజెండా గానీ ఏంటో ఇప్పటికీ ఎవరికీ స్పష్టత లేదు.

?రాజకీయాలు అంటే వారాంతాల్లో హైదరాబాద్‌కు వచ్చి మైకుల ముందు నిలబడి ఆవేశపూరితమైన గంభీర ఉపన్యాసాలు దంచి వెళ్లిపోవడం కాదు. నిరంతరం ప్రజల మధ్య ఉండటం, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమించడం. ప్రస్తుతం ఏపీలో ఉపముఖ్యమంత్రిగా కొలువుదీరిన పవన్ కల్యాణ్, అక్కడి పాలనా బాధ్యతలను, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి తెలంగాణలో 'రాజకీయ పర్యాటకం' చేస్తాననడం తీవ్రమైన బాధ్యతా రాహిత్యం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తుంటే, ఈయన మాత్రం తెలంగాణ స్థానిక సంస్థలు, జిహెచ్ఎంసి ఎన్నికలను పురస్కరించుకుని ఇక్కడ రాజకీయం చేయడానికి సిద్ధపడటం ఇరు రాష్ట్రాల ప్రజలను మోసం చేయడమే అవుతుంది.

?తెలంగాణ ప్రజలు రాజకీయంగా అత్యంత చైతన్యవంతులు, విచక్షణ కలిగినవారు. సినీ గ్లామర్‌ను, హీరోల మేనియాను చూసి మైదానాలకు జనాన్ని తరలించవచ్చేమో కానీ, వారి చేత పోలింగ్ బూతుల్లో ఓట్లు వేయించడం ఏమాత్రం సాధ్యం కాదు. పార్ట్-టైమ్ రాజకీయ నాయకులను, పండగ్గోడళ్లాగా కేవలం ఎన్నికలప్పుడే ఊడిపడే కొత్త పార్టీలను తెలంగాణ సమాజం ఎప్పుడో తిరస్కరించింది. గతంలో అనేకమంది సినీ ప్రముఖులు వచ్చి ఇక్కడ పార్టీలు పెట్టి బోల్తా పడిన చరిత్ర కళ్లముందు కనిపిస్తున్నా, పవన్ కల్యాణ్ ఇంకా అదే భ్రమల్లో బ్రతుకుతుండటం విచారకరం.

?ఏ రకమైన స్పష్టమైన సిద్ధాంతం, బలమైన స్థానిక నాయకత్వం, ప్రజాదరణ లేని జనసేన హడావుడి వల్ల తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి భూకంపాలు రావు. కేవలం సోషల్ మీడియాలో హడావుడి చేసి తమ ఉనికిని కాపాడుకోవడానికి, భాజపా దగ్గర కొన్ని స్థానాల కోసం బేరసారాలు ఆడటానికి పవన్ కల్యాణ్ వేస్తున్న ఈ వేషాలు కేవలం ఒక రాజకీయ నాటకం మాత్రమే. ఈ పర్యటనల వల్ల పొత్తుల సమీకరణాలు మారడం దేవుడెరుగు, తెలంగాణ మట్టిలో జనసేనకు మిగిలిన కొద్దిపాటి ఉనికి కూడా కాలగర్భంలో కలసిపోవడం ఖాయం!




వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# వినాయకుడి రూపంలో దాగిన జీవిత సత్యాలు

వినాయకుడి విగ్రహాన్ని చూసినప్పుడు ముందుగా కనిపించేది ఆయన ఏనుగు తల. ఆ తర్వాత పెద్ద చెవులు, చిన్న కళ్లు, తొండం, పెద్ద పొట్ట, చిన్న మూషిక వాహనం.. ఇవన్నీ కలిపి చూస్తే ఒక ప్రత్యేకమైన రూపం కనిపిస్తుంది. కానీ మన పూర్వీకులు ఈ రూపాన్ని కేవలం అందం కోసం రూపొందించలేదు.
వినాయకుడి రూపంలోని ప్రతి అంశంలోనూ మనిషి జీవితానికి ఒక సందేశం ఉందని భావించారు.
వినాయకుడి పెద్ద చెవులు ముందుగా మన దృష్టిని ఆకర్షిస్తాయి. పెద్ద చెవులు అంటే ఎక్కువగా వినడం అనే భావనతో వీటిని అన్వయిస్తారు. మనిషి జీవితంలో ఎన్నో సమస్యలు కేవలం వినకపోవడం వల్లే వస్తుంటాయి. ఎదుటివాడు ఏం చెప్పాలనుకుంటున్నాడో పూర్తిగా వినకముందే సమాధానం చెప్పడం, ఇతరుల మాటను మధ్యలోనే ఆపేయడం, తన అభిప్రాయమే సరైందని భావించడం.. ఇవి సంబంధాలను దూరం చేస్తాయి. వినాయకుడి పెద్ద చెవులు మాత్రం "ముందుగా విను.. ఆ తర్వాత ఆలోచించు" అనే సందేశాన్ని గుర్తు చేస్తాయి.
ఆయన చిన్న కళ్లు మరో ప్రత్యేకత. విశాలమైన ప్రపంచంలో అవసరమైన విషయంపై దృష్టిని కేంద్రీకరించుకోవాలనే భావనకు వాటిని ప్రతీకగా చూస్తారు. మనిషి చుట్టూ ఎన్నో విషయాలు జరుగుతుంటాయి. ప్రతి విషయాన్ని పట్టించుకుంటే మనసు గందరగోళంగా మారుతుంది. ఏది అవసరం? ఏది అనవసరం? ఏది మన ప్రయాణానికి ఉపయోగపడుతుంది? అనే వివేచన అవసరం. పెద్ద చెవులతో ఎక్కువ వినాలి.. చిన్న కళ్లతో అవసరమైనదాన్ని గమనించాలి అనే సందేశాన్ని వినాయక రూపం గుర్తు చేస్తుంది.
తర్వాత కనిపించేది తొండం. ఏనుగు తొండం బలమైన వస్తువును కూడా ఎత్తగలదు.. సున్నితమైన వస్తువును కూడా జాగ్రత్తగా పట్టుకోగలదు. అందుకే పరిస్థితికి అనుగుణంగా మన ప్రవర్తనను మార్చుకోవాలనే భావనతో దీనిని అనుసంధానిస్తారు. జీవితంలో కొన్ని సందర్భాల్లో కఠినంగా ఉండాలి. మరికొన్ని సందర్భాల్లో ఎంతో సున్నితంగా వ్యవహరించాలి. ప్రతి సమస్యకు ఒకే విధమైన సమాధానం ఉండదు. పరిస్థితిని అర్థం చేసుకుని స్పందించగలగడం కూడా జ్ఞానమే.



వినాయకుడి పెద్ద పొట్టను కూడా ఒక గొప్ప జీవిత సందేశానికి ప్రతీకగా భావిస్తారు. జీవితంలో ఎదురయ్యే మంచి, చెడు అనుభవాలను జీర్ణించుకునే సామర్థ్యం మనిషికి ఉండాలి. ఎవరో ఒకరు చెప్పిన మాటకు వెంటనే స్పందించడం, చిన్న సమస్యకే మనశ్శాంతి కోల్పోవడం కంటే.. కొంత ఓపికతో ఆలోచించి స్పందించడం మంచిది. జరిగిన ప్రతిదాన్ని మనసులో భారంగా మోస్తే జీవితం ముందుకు సాగదు.
అన్నింటికంటే ఆసక్తికరమైనది వినాయకుడి వాహనం మూషికం. ఇంత పెద్ద దేహం ఉన్న దేవతకు ఇంత చిన్న జీవి వాహనంగా ఉండటం వెనుక కూడా ఒక ప్రతీకాత్మక భావనను చూస్తారు. మనిషి మనసులోని కోరికలు, చంచలత్వం, ఎప్పుడూ ఏదో ఒకదాని వెంట పరుగెత్తే స్వభావాన్ని మూషికంతో పోల్చే సంప్రదాయ వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఆ చంచలమైన స్వభావాన్ని నియంత్రించగలిగినప్పుడే జ్ఞానం, వివేకం మనిషికి మార్గదర్శకంగా నిలుస్తాయి.
అందుకే వినాయకుడిని పూజించడం అంటే కేవలం పూలు, పత్రి, నైవేద్యాలు సమర్పించడం మాత్రమే కాదు. ఆయన రూపాన్ని ఒక్కసారి గమనించడం కూడా ఒక ఆత్మపరిశీలన. నేను ఇతరుల మాట ఎంతవరకు వింటున్నాను? అవసరమైన విషయంపై నా దృష్టి ఎంతవరకు ఉంది? పరిస్థితికి తగ్గట్టు నేను మారగలుగుతున్నానా? సమస్యలను ఓపికగా జీర్ణించుకోగలుగుతున్నానా? నా కోరికలను నేను నియంత్రించగలుగుతున్నానా? అనే ప్రశ్నలు మనలో కలిగితే.. అదే ఆరాధనకు మరో అర్థం.
వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంట్లో విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకు పండుగ వాతావరణంలో పాల్గొంటారు. కానీ పండుగ ముగిసిన తర్వాత విగ్రహం మాత్రమే వెళ్లిపోకూడదు.. ఆ రూపం చెప్పిన సందేశం మాత్రం మన జీవితంలో మిగలాలి.
వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవుడిగా భక్తుల ఆరాధన పొందుతాడు. కానీ మన జీవితంలోని కొన్ని విఘ్నాలను మనమే సృష్టించుకుంటాం. తొందరపాటు నిర్ణయాలు, అహంకారం, వినకపోవడం, కోపం, అదుపులేని కోరికలు.. ఇవే కొన్నిసార్లు మన ముందున్న దారిని మూసేస్తాయి. వాటిని గుర్తించి మార్చుకోవడం కూడా వినాయకుడి ఆరాధనలోని అంతరార్థంగా భావించవచ్చు.
ఈ వినాయక చవితికి ఇంట్లో వినాయకుడిని ప్రతిష్ఠించండి.. భక్తితో పూజించండి.. నైవేద్యం సమర్పించండి. కానీ ఒక చిన్న సంకల్పం కూడా చేసుకోండి --- ఎక్కువగా వింటాను, అవసరమైనదానిపై దృష్టి పెడతాను, పరిస్థితికి తగ్గట్టు నడుచుకుంటాను, కష్టాలను ఓపికగా ఎదుర్కొంటాను, నా కోరికలను అదుపులో ఉంచుకుంటాను అని. అప్పుడు మట్టి విగ్రహాన్ని పూజించిన పండుగ.. మనిషిలోని మంచితనాన్ని మేల్కొలిపిన పండుగగా మారుతుంది. అదే వినాయక చవితి అసలైన సందేశం.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# మట్టితోనే గణనాథుడి ప్రతిష్ఠ

## 2014 నుంచి కొనసాగుతున్న సంప్రదాయం

బాసర సెప్టెంబర్ 13(తెలంగాణ వెన్నెల వాక్కు)నిర్మల్ జిల్లా బాసరలో వినాయక చవితి వచ్చిందంటే ప్రతి గ్రామంలోనూ గణనాథుడి విగ్రహాల ప్రతిష్ఠాపన సందడి కనిపిస్తుంది. అయితే బాసరలోని బొర్ర గణేష్ కాలనీలో ఉన్న గణేష్ ఆలయంలో మాత్రం అందుకు భిన్నమైన సంప్రదాయం కొనసాగుతోంది. ఏటా మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. భక్తి, సంప్రదాయంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ కొనసాగుతున్న ఈ విధానం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.
2014లో మొదలైన మట్టి గణపతి ప్రతిష్టించు సంప్రదాయం
ఆలయ అర్చకులు, భక్తుల ప్రోత్సాహంతో 2014లో మమ్మాయి సచిన్ ఆధ్వర్యంలోలిబొర్ర గణేష్ కాలనీలోని ఆలయంలో మట్టి గణపతి విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్ఠించారు. కొన్ని సంవత్సరాల పాటు స్థానికంగానే మట్టి గణపతి విగ్రహాన్ని తయారు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి ఏడాది నిజామాబాద్ నుంచి మట్టి విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠిస్తున్నారు.
అప్పటి నుంచి నేటి వరకు మట్టి గణపతికే ప్రత్యేక పూజలు నిర్వహించడం కొనసాగుతోంది. వినాయక చవితి సందర్భంగా మట్టి గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



**పర్యావరణ పరిరక్షణకు ప్రతీక**
మట్టి వినాయకుడిని పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు, పండితులు చెబుతున్నారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో నిమజ్జనం అనంతరం పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు.
భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలకృష్ణ భాస్కర్ మహారాజ్ పేర్కొంటున్నారు. ప్రకృతిని పరిరక్షిస్తూ మట్టి గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించాలని ఆయన సూచిస్తున్నారు.
**వందల ఏళ్ల చరిత్రకు సాక్షిగా..**
బొర్ర గణేష్ గల్లీలోని ఈ ఆలయానికి ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యం ఉందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా ఇక్కడ రాతితో చెక్కిన గణపతి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న రాతి గణపతిని దర్శించుకునేందుకు బాసరతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.
ఆలయంలో గణపతితో పాటు నందీశ్వరుడు, నవగ్రహాలు, శివుడు, హనుమంతుడు తదితర దేవతామూర్తులు కొలువుదీరారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.
**పర్వదినాల్లో ప్రత్యేక పూజలు**
సంకట చతుర్థి వినాయక చవితితో పాటు ఎడ్ల పొలాల అమావాస్య తదితర పర్వదినాలను కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.
వినాయక చవితి సందర్భంగా యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారుతోంది.
**బాసర గ్రామానికే ఆదర్శంగా..**
ఏటా మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం ద్వారా బొర్ర గణేష్ ఆలయ కమిటీ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే ప్రకృతిని కాపాడాలనే సందేశాన్ని భక్తులకు అందిస్తోంది.'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి గణపతిని పూజిద్దాం' అనే సందేశంతో కొనసాగుతున్న ఈ సంప్రదాయం బాసరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. భక్తి, సంప్రదాయం, పర్యావరణ పరిరక్షణను మేళవించిన బొర్ర గణేష్ ఆలయ మట్టి గణపతి వేడుకలు ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# తెలంగాణపై జనసేన ప్రత్యేక ఫోకస్:

?హైదరాబాద్, సెప్టెంబర్ 13:
పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రిగా, అత్యంత బలమైన రాజకీయ శక్త్యాత్మక భాగస్వామిగా నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్న జనసేన పార్టీ, ఇప్పుడు పొరుగున ఉన్న తెలంగాణ రాజకీయాలపై కూడా తన ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోంది. జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో విస్తృత స్థాయిలో పర్యటించడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు వెలువడుతున్న వార్తలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున సంచలనం రేపుతున్నాయి. పవన్ కల్యాణ్ రాక మరియు ఆయన పర్యటన ఖరారైతే తెలంగాణలోని రాజకీయ సమీకరణాలు, ముఖ్యంగా భవిష్యత్ ఎన్నికల నాటికి ప్రధాన రాజకీయ పార్టీల పొత్తుల ధోరణులు పూర్తిగా కొత్త మలుపులు తిరిగే అవకాశముందని రాజకీయన విశ్లేషకులు స్పష్టంగా అంచనా వేస్తున్నారు.
?తెలంగాణలో జనసేన పునర్నిర్మాణంపై దృష్టి
ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్[...]
అధికారాన్ని పంచుకున్న ఉత్సా[...]
ఉన్న జనసేన పార్టీ, తెలంగాణ[...]
క్షేత్రస్థాయి నుంచి పార్టీ యంత్ర[...]
బలోపేతం చేయాలని గట్టి సం[...]
ఉంది. గతంలో జరిగిన శాసన[...]
లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో[...]
స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, ఈసారి మాత్రం సంస్థాగతంగా పార్టీ గ్రామ స్థాయి కమిటీల నుంచి జిల్లా స్థాయి కమిటీల వరకు పునర్నిర్మాణం



రూపుదిద్దుకుంటోంది. పవన్ కల్యాణ్‌కు తెలంగాణ యువతలో ఉన్న అపారమైన ఆదరణను ఓటు బ్యాంకుగా మార్చుకోవడమే లక్ష్యంగా నాయకులు

# పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అండ:

కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, పలువురు శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఆర్యవైశ్య మహాసభ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు ప్రముఖ వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
?ఆత్మగౌరవ భవనానికి ప్రభుత్వ సంపూర్ణ సహకారం
శంకుస్థాపన మహోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఉప్పల్ భగాయత్‌లో నిర్మించబోయే ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల నిధులు, అనుమతుల రూపంలో సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. నిర్మించబోయే ఈ భవనం కేవలం శ్లాబులు, గోడలతో కూడిన భవనంగా మిగిలిపోకూడదని, ఇది గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లల చదువులకు, వారి ఉద్యోగ ఉపాధి అవకాశాలకు, మరియు సమాజ శ్రేయస్సుకు సంపూర్ణంగా ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులకు ప్రత్యేకంగా సూచించారు.
?మహాత్మా గాంధీ, రోశయ్యల సేవలకు నివాళులు
సాధారణ ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన అహింసా మూర్తి మహాత్మా గాంధీ గారు భారతదేశం నుంచి ప్రపంచస్థాయి నేతగా ఎదిగి, భారతీయులందరికీ ప్రపంచ వేదికపై తిరుగులేని గుర్తింపు తెచ్చారని సీఎం స్మరించుకున్నారు. నేడు ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా మహాత్మా గాంధీ గారి విగ్రహాలు, ఆయన చూపిన శాంతి మార్గమే మనకు దర్శనమిస్తాయని గుర్తుచేశారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి ఆత్మబలిదానాన్ని, అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘకాలం ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా సేవలు అందించి ఆర్థిక క్రమశిక్షణకు ఆద్యుడిగా నిలిచిన కొణిజేటి రోశయ్య గారి విశేషమైన దార్శనికతను సీఎం రేవంత్ రెడ్డి ఈ వేదికపై సగర్వంగా ప్రస్తావించారు.
?విశ్వాసానికి నిలువెత్తు బ్రాండ్ అంబాసిడర్లు
గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు, రైతులకు అత్యంత క్లిష్ట సమయాల్లో నిత్యవసర సరుకులు అరువుగా ఇచ్చి ఆదుకునే విషయంలో మానవత్వంతో వ్యవహరించే విశాల హృదయం ఆర్యవైశ్యుల సొంతమని సీఎం అభివర్ణించారు. ముందుచూపుతో వ్యవహరించడం, సమయానుకూలంగా జాగ్రత్తగా అడుగులు వేయడం ఆర్యవైశ్యుల రక్తంలోనే ఉందన్నారు.
?సమైక్యతతోనే రాజకీయ అధికారంలో భాగస్వామ్యం
ఆర్యవైశ్యులంతా విడిపోకుండా కలిసికట్టుగా, సమైక్యంగా ఒకే తాటిపై నడిచినప్పుడే సమాజంలో వారికి రావాల్సిన అసలైన బలం చేకూరుతుందని సీఎం పిలుపునిచ్చారు. ఐక్యంగా పోరాడినప్పుడే రాజకీయాల్లో తమకు దక్కాల్సిన వాటాను తామే స్వయంగా సాధించుకోగలరని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపాలిటీలు, వివిధ కార్పొరేషన్ పదవుల్లో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించిందని గుర్తుచేస్తూ, రాబోయే రోజుల్లో కూడా ఆర్యవైశ్యుల ఆర్థిక, రాజకీయ వికాసానికి కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# సరిహద్దుల వద్ద శాంతి, వాణిజ్య అసమతుల్యతల నివారణే లక్ష్యం

## భారత్-చైనా దౌత్య సంబంధాలపై ప్రత్యేక విశ్లేషణ



న్యూఢిల్లీ బ్యూరో
ప్రపంచంలోనే రెండు అతిపెద్ద జనాభా కలిగిన పొరుగు దేశాలైన భారతదేశం మరియు చైనాల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలకడంపై ఇరు దేశాల దౌత్య వర్గాలు దృష్టి సారించాయి. వాస్తవాధీన రేఖ వెంట సంపూర్ణ శాంతిభద్రతలను పునరుద్ధరించడంతో పాటు, ఇరు దేశాల మధ్య ఏటికేడాది తీవ్రమవుతున్న వాణిజ్య అసమతుల్యతను నివారించడమే ప్రధాన ధ్యేయంగా భారత్ స్పష్టం చేసింది. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పునరుద్ధరించకుండా, సరిహద్దు ప్రాంతాలలో శాంతియుత వాతావరణం నెలకొల్పకుండా ఇతర రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలు వేగంగా పురోగమించడం సాధ్యం కాదనే విషయాన్ని భారతదేశం దౌత్య వేదికలపై కచ్చితంగా పునరుద్ఘాటించింది.తూర్పు లడఖ్ సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రాంతాల నుంచి సైనిక ఉపసంహరణ ప్రక్రియ వేగవంతం కావడం, కమాండర్ల స్థాయి చర్చలు సానుకూలంగా సాగడం ద్వైపాక్షిక సంబంధాలలో కొంత ఊరట కలిగిస్తోంది. సరిహద్దుల్లో ఎటువంటి ఏకపక్ష మార్పులకు తావులేకుండా, గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలకు కట్టుబడి ఉండాలని భారత్ పట్టుబడుతోంది. సైనిక వ్యూహాత్మక స్థావరాల వద్ద పెట్రోలింగ్ హక్కులను పునరుద్ధరించడం మరియు ప్రాంగణాల్లో సజావుగా కదలికలు ఉండటం ద్వారా మాత్రమే ఇరు దేశాల ఆర్మీ బలగాల మధ్య విశ్వాసం పెరుగుతుంది. సరిహద్దుల్లో శాంతి భద్రతలు నెలకొంటేనే, రెండు శతాబ్దాల నాటి చారిత్రక సంబంధాలు మళ్లీ పటిష్టమవుతాయని, ప్రాంతీయ స్థిరత్వానికి ఇది ఎంతో అవసరమని దౌత్య నిపుణులు విశ్లేషిస్తున్నారు.క్రమబద్ధీకరించాల్సిన వాణిజ్య అసమతుల్యతమరోవైపు భారత్-చైనా ద్వైపాక్షిక వాణిజ్యం వంద బిలియన్ డాలర్ల మార్కును దాటి కొత్త రికార్డులను తాకుతున్నప్పటికీ, ఇందులో భారత్‌కు లభిస్తున్న ప్రయోజనం చాలా తక్కువగా ఉంది. చైనా నుంచి భారత్‌కు పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, క్రియాశీల ఔషధ పదార్థాలు (ఏపీఐ×), రసాయనాలు దిగుమతి అవుతుండగా; భారత్ నుంచి

# గణేష్ మండపాల వద్ద భద్రతా జాగ్రత్తలు తప్పనిసరి

## ముధోల్ సీఐ రవీందర్ నాయక్

ముధోల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు, యువత భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముధోల్ సీఐ రవీందర్ నాయక్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు పోలీసు ఇంటిమేషన్ ఫారాలను సమర్పించి, విగ్రహాల రాక,



నిమజ్జన ఊరేగింపుల రూట్ వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా మండపాలను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద రాత్రి సమయాల్లో కనీసం ముగ్గురు వ్యక్తులు కాపలాగా ఉండాలని ఆదేశించారు. ఊరేగింపుల్లో డీజేలు, సౌండ్ బాక్సుల వినియోగంపై ఉన్న నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథిలో వెయ్యి ఉద్యోగాలు భర్తీ చేయాలి:

నిజామాబాద్/నిర్మల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ మలిదశ ఉద్యమంలో పల్లెపల్లెనా ధూంధాంలతో ప్రజలను చైతన్యపరిచిన ఉద్యమ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా నాయకులు చిట్టిబాబు, మహేందర్, రమేష్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వెయ్యి ఉద్యోగాల హామీని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు.



అసెంబ్లీలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కళాకారులపై మాట్లాడిన మాటలు కాలయాపనకే పరిమితమయ్యాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో కొందరికే ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అసలైన కళాకారులు నేటికీ ఉపాధి లేక దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే 33 జిల్లాల కళాకారులతో రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

# నిర్మల్‌లో ఘనంగా 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు

## 'వేయి ఉరుల మర్రి' అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ నేతల నివాళులు

నిర్మల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణ కేంద్రంలో 78వ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలను ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ ఎస్. విలాస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని కోరన్నపేటలో గల చారిత్రాత్మక 'వేయి ఉరుల మర్రి' స్మారక స్థూపం వరకు ర్యాలీగా వెళ్లి అమరవీరులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, వెట్టిచాకిరీ, రజాకార్ల దౌర్జన్యాలకు




వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన సాయుధ పోరాటం వల్లే తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో కొమురం భీమ్, రామ్‌జీ గోండ్‌లతో పాటు ఎందరో కమ్యూనిస్టు యోధులు నేలకొరిగారని గుర్తుచేశారు. ఈ చారిత్రక పోరాటాన్ని మతపరంగా చిత్రీకరించే యత్నాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో బూక్యా రమేష్, ఎస్.ఎన్. రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కైలాష్, పుండలీక్, శివాజీ పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి:




కరీంనగర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గత మూడు నెలలుగా నిలిచిపోయిన ప్రీ ప్రైమరీ పాఠశాలల ఇన్స్ట్రక్టర్లు, ఆయాల జీతాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూనియన్ రాష్ట్ర న్యాయ సలహాదారు జక్కనపల్లి గణేష్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఎం. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నగరంలోని స్నేహ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అదనపు పనిభారాన్ని తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు వర్తింపజేయాలని కోరారు. కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు సవరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా నూతన అడ్హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సుమయా సదాఫ్, కో-కన్వీనర్లుగా గుండ మమత, ధనూజ, శ్రావ్య, మౌనిక, అనిత, భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు శ్యామల, కవిత, రవళి, శిరీష, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# సిర్పల్లి అడవుల్లో లేగదూడపై దాడి చేసింది చిరుతపులే:

## నిర్మల్ ఎఫ్ఆర్వో రామకృష్ణారావు

సారంగాపూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండల పరిధిలోని సిర్పల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం లేగదూడపై దాడి చేసి చంపింది చిరుతపులేనని నిర్మల్ ఎఫ్ఆర్వో రామకృష్ణారావు స్పష్టం చేశారు. అటవీ ప్రాంతంలో పశువుపై దాడి జరిగిన వెంటనే అటవీ శాఖ అధికారులు అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరిశీలించగా, చిరుతపులి దాడి చేసినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సమీప గ్రామాల రైతులు, పశువుల కాపరులు



అటవీ ప్రాంతాల్లోకి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వన్యప్రాణులకు ఎవరూ ఎలాంటి హాని తలపెట్టవద్దని, పశువులు వన్యప్రాణుల దాడిలో మరణిస్తే అటవీ శాఖకు సమాచారం అందిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పర్యవేక్షణలో సారంగాపూర్ డిప్యూటీ ఎఫ్ఆర్వో మహమ్మద్ నజీర్ ఖాన్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి హర్షవర్ధన్, ఎఫ్ఎస్వోలు సంధ్య, సంతోష్, సుజాత, వెన్నెల పాల్గొన్నారు.

# ఎస్పీ జానకి షర్మిలపై అసత్య ప్రచారాలు తగవు

## నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం ఖండన

నిర్మల్, సెప్టెంబర్ 13: జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిలపై కొందరు స్వార్థపూరిత శక్తులు చేస్తున్న నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారాన్ని నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. వాస్తవాలను వక్రీకరిస్తూ సోషల్ మీడియా, ఇతర వేదికల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని సంఘం సూచించింది. ఎస్పీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేసింది.

ఎస్పీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పోలీస్ సిబ్బంది సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని సంఘం తెలిపింది. నిర్మల్‌లో ప్రతిరోజూ, దూరప్రాంత సిబ్బంది కోసం ప్రతి బుధవారం భైంసాలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. హోంగార్డులు సైతం తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించారని తెలిపింది.

సిబ్బందిపై ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా కోఆపరేటివ్ రుణ సబ్‌స్క్రిప్షన్‌ను రూ.975 నుంచి రూ.500లకు తగ్గించడంతో పాటు అర్హులైన సిబ్బందికి రూ.3 లక్షల వరకు రుణాలు అందేలా చర్యలు తీసుకున్నారని సంఘం వివరించింది. సాధారణ బదిలీలు, అటాచ్‌మెంట్లు వంటి పరిపాలనా ప్రక్రియలను వ్యక్తిగత నిర్ణయాలుగా చిత్రీకరించడం సరికాదని పేర్కొంది.

బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల భద్రత, వారి సమస్యల పరిష్కారంపై ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని సంఘం తెలిపింది. విద్యార్థులు ఆమెను ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునేంతగా వారికి అండగా నిలుస్తున్నారని పేర్కొంది. ఇటీవల నిర్వహించిన పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలను కూడా రహస్య బ్యాలెట్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, వాటికి కుల, మత రంగు పులమడం విచారకరమని తెలిపింది.

జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, దీనిని



జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు పోలీసుల పేరుతో అనామక లేఖలు సృష్టించి దుష్ప్రచారం చేస్తున్నారని సంఘం ఆరోపించింది. నిరాధార సమాచారాన్ని ప్రచారం చేస్తూ వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించడం సరికాదని, ఇలాంటి వ్యవహారాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రజలు వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మకుండా వాస్తవాలను నిర్ధారించుకోవాలని పోలీస్ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది.

# దిలావర్‌పూర్ తండాలో బంజారాల తీజ్ పండుగ సంబరాలు

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బంజారాల పవిత్ర సంస్కృతికి ప్రతీక అయిన తీజ్ పండుగను దిలావర్‌పూర్ తండాలో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నియమనిష్టలతో పూజించిన తీజ్ గోధుమ బుట్టలను తలపై



పెట్టుకుని గిరిజన యువతులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. డీజే సంప్రదాయ బంజారా గీతాలకు అనుగుణంగా యువతులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. తండా సమీపంలోని చెరువు వద్దకు చేరుకుని భోగుబండారు పూజలు జరిపి, తీజ్ బుట్టలను భక్తిశ్రద్ధలతో నీటిలో నిమజ్జనం చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఆడపడుచుల జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని వేడుకున్నారు. తొమ్మిది రోజుల పాటు సాగిన ఉత్సవాలు నిమజ్జనంతో ముగిశాయని తండా పెద్దలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు, యువతులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### సెప్టెంబర్ 17న పల్లెపల్లెనా జాతీయ జెండాల ఆవిష్కరణ..




ముధోల్/భైంసా, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ ప్రాంతానికి నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబర్ 17వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం భైంసా పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో నిజాం సంస్థానం భారత్‌లో విలీనమైందని గుర్తు చేశారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో విమోచన వేడుకలను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తుంటే, తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ఒక వర్గం ఓట్ల కోసం అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. రాజధాని హైదరాబాద్‌లో సర్దార్ పటేల్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న బీజేపీ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన జాతీయ జెండాలను ఎగురవేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా రెడ్డి, సీనియర్ నేత సాంప్లీ రమేష్, ఉపాధ్యక్షుడు రమేష్, భైంసా మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణచాంద, వడ్యాల్ అభివృద్ధి పనులకు రూ. 10.80 కోట్ల నిధులు మంజూరు

### డబుల్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు టెండర్లు ఖరారు.. కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): లక్ష్మణచాంద మండల కేంద్రంతో పాటు వడ్యాల్ గ్రామంలో పలు ప్రధాన అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్ల 80 లక్షల నిధులను మంజూరు చేసి టెండర్లను ఆహ్వానించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. వడ్యాల్ గ్రామంలో డబుల్ లైన్ రోడ్డు, సీసీ రోడ్డు, బైపాస్ రోడ్డు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు, అలాగే లక్ష్మణచాంద హెడ్‌క్వార్టర్‌లో డబుల్ లైన్ రహదారి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిమిత్తం ఈ నిధులు కేటాయించారు. నిధుల మంజూరుకు విశేష కృషి చేసిన నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమా భీమారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కొంద్రు రామిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంద్ర నరేష్ రెడ్డి, సర్పంచులు పసుపుల నరేష్, బూసి ముత్యం, రాజ్యలక్ష్మి రాజు, మాజీ జెడ్పీటీసీ నారా గౌడ్, ప్రతాప్ రెడ్డి, నారాయణ, గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఐఎంఏ నిర్మల్ శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ గడపాలె రమేష్ ఏకగ్రీవ ఎన్నిక



నిర్మల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్మల్ శాఖ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ సీనియర్ శిశు వైద్య నిపుణులు డాక్టర్ గడపాలె రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఎంఏ భవన ప్రాంగణంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, కోశాధికారిగా డాక్టర్ కావేటి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ వేణుగోపాలకృష్ణ, డాక్టర్ జీకే ప్రశాంత్, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ మహేష్ బాబు, డాక్టర్ సుధీర్ కుమార్, మహిళా విభాగం ప్రతినిధిగా డాక్టర్ అనిత రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ అప్పల చక్రధారి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రమణ గౌడ్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ సురేష్, డాక్టర్ ఎం. ప్రభాకర్ రావు ఎన్నిక కాగా, గౌరవ సలహాదారుగా డాక్టర్ దామెర రాములును నియమించారు. నిర్మల్ ఐఎంఏ సేవలు రాష్ట్రంలోనే ఆదర్శవంతమైనవని సీనియర్ వైద్యులు చక్రధారి కొనియాడారు.

## ప్రభుత్వ నిర్బంధాలకు వ్యతిరేకంగా 16న ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్షలు:

నిర్మల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): హక్కుల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఆశా, అంగన్వాడీ కార్యకర్తలను అర్ధరాత్రి వేళల్లో బస్సుల నుంచి దించి అక్రమంగా నిర్బంధించడాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 16న నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ తెలిపారు. ఆదివారం నిర్మల్ టీఎన్జీవో భవన్‌లో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే కార్మికుల గొంతులను అణచివేస్తూ దమనకాండ సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆశా వర్కర్లకు రూ. 18 వేల కనీస వేతనం ఇవ్వకుండా ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. కార్మికులంతా ఏకమై 16న జరిగే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి. గంగామణి, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి. సుజాత, ఉపాధ్యక్షులు చంద్రకళ, సుగుణ, రామలక్ష్మి, భాగ్య, మంజుల, లక్ష్మి, క్లైమెంట్ వెస్లీ పాల్గొన్నారు.



## కౌట్ల (బి) శాంతినగర్‌లో ఘనంగా గిరిజనుల తీజ్ పండుగ సంబరాలు



సారంగాపూర్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండల పరిధిలోని కౌట్ల (బి) శాంతినగర్ గిరిజన తండాలో తీజ్ పండుగ వేడుకలను బంజారా సంప్రదాయ పద్ధతుల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పెళ్లికాని యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి వీధుల్లో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వెదురు బుట్టలలో గోధుమ నారును మొలకెత్తించి, చివరి రోజు భోగుబండారు పూజా కార్యక్రమాలు జరిపి నిమజ్జనం చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ఆడపడుచులకు సుఖసంతోషాలు కలగాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో శాంతినగర్ తండా నాయక్ రాథోడ్ సీతారాం, కారోబారి దావ్రా, పూజారి దేవిదాస్, తేజు నాయక్, గంగాధర్, ప్రభాకర్, తండా పెద్దలు, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీఆర్టీఎఫ్ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా సుంక ప్రేమలత



నిర్మల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సుంక ప్రేమలతను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్, గడ్డం భూమన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, అంజిరెడ్డిలు ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలతో పాటు మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రేమలత మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఆమె నియామకం పట్ల పలువురు ఉపాధ్యాయులు, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## చించాల సాహితీవేత్త పీసర శ్రీనివాస్ గౌడ్‌కు ‘అష్టావధాన బంధువు’ పురస్కారం



ముధోల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల పరిధిలోని చించాల గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి పీసర శ్రీనివాస్ గౌడ్ ప్రతిష్టాత్మకమైన ‘అష్టావధాన బంధువు’ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీ హంసవాహిని సాహిత్య కళా పీఠం ఆధ్వర్యంలో డిజిటల్ వేదికగా నిర్వహించిన లఘు అష్టావధాన ప్రక్రియలో పాల్గొని పద్య రచనలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు గాను ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు జాధవ్ పుండలిక్ రావు పాటిల్, అధ్యక్షుడు జాగిరి యాదగిరి, సంచాలకుడు బొందిడి పురుషోత్తమ రావు ఆయనకు అవార్డును అందజేసి సత్కరించారు. శ్రీనివాస్ గౌడ్‌కు పురస్కారం లభించడం పట్ల సాహితీ ప్రముఖులు బసవరాజు, పి.బి.ఎల్.కె. ప్రసాద్, కవయిత్రులు దేవిప్రియ, దుర్గాభవాని, వరలక్ష్మి, అరుణకుమారి, కవులు దశరథ్, పోతన్న, గోపి అభినందనలు తెలిపారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు భూమన్నకు ముధోల్‌లో ఘన సన్మానం



ముధోల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న రిసోర్స్ టీచర్ కే. భూమన్నను ఆదివారం ముధోల్ మండల కేంద్రంలో మిత్రమండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి భూమన్న చేస్తున్న నిస్వార్థ సేవలను మిత్రులు కొనియాడారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణను పెంపొందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు బి. పోతన్న యాదవ్, నాగేష్, ఉమేష్, శంకు పటేల్, సాయన్న, ఫారూక్, శంకర్, పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి మృతి చెందిన గణేష్ కుటుంబానికి మోహన్‌రావ్ పటేల్ ట్రస్ట్ రూ. 10 వేల సాయం

కుబీర్/ముధోల్, సెప్టెంబర్ 13 (తెలంగాణ వెన్నెల వాక్కు): కుబీర్ మండల కేంద్రంలో ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన యువకుడు గణేష్ నిరుపేద కుటుంబానికి భోస్లే మోహన్‌రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆర్థిక భరోసా కల్పించింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావ్ పటేల్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావ్ పటేల్ మాట్లాడుతూ ఆకస్మిక ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోయిన పేద కుటుంబాలను ఆదుకోవడమే ట్రస్ట్ ముఖ్య లక్ష్యమన్నారు. పిడుగుపాటు, పాముకాటు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాల బారిన పడిన బాధితులకు ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవలందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్డి (బి) సర్పంచ్ మడి ప్రవీణ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సంతోష్, పుప్పాల లింగం, స్వామి, కమలేశ్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER